క్లుప్తంగా

'బార్' కార్యవర్గానికి సన్మానం



కార్యవర్గాన్ని సత్కరిస్తున్న ట్రస్ట్ సభ్యులు

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో కాకినాడ బార్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఆదివారం సన్మానించారు. సంఘం అధ్యక్షుడు ముత్తింటి విశ్వేశ్వరరావు, కార్యదర్శి చెక్కా శ్రీనివాస్, కోశాధికారి బహదూర్ వెంకటరెడ్డిలను అడబాల ట్రస్ట్ చైర్మన్ అడబాల రత్నప్రసాద్ సన్మానించారు. న్యాయవాదులు యనమల రామం, కె.శ్రీరామరాజు, డాక్టరు వెంకటరమణ, డాక్టరు శిరీష, మాణిక రెడ్డి సత్యనారాయణ, శ్రీనగేష్, చింతపల్లి సుబ్బారావు, రేలంగి బాపిరాజు, అడబాల సత్యనారాయణ, ఉంగరాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

34వ సారి రక్తదానం



రక్తదాత రాంబాబు

కరప: గ్రామానికి చెందిన బొల్లంరెడ్డి రాంబాబు 34వ సారి రక్తదానం చేసి అందరికీ ఆదర్శంగా నిలిచారు. కాకినాడలోని మెడికవర్ హాస్పటల్‌లో జగన్నాథం అనే రోగికి అత్యవసరంగా ఎబి పాజిటివ్‌లో (సబ్‌గ్రూపు ఏ–2) ఎక్కించాల్సి రావడంతో ఒక వాట్సప్ గ్రూప్ నుంచి సమాచారం అందుకున్న గ్రామ మాజీసర్పంచ్ పోలిశెట్టి తాతీలు స్పందించి తనమిత్రుడు బొల్లంరెడ్డి రాంబాబును వివరించి కాకినాడలోని రెడ్‌క్రాస్ సంస్థకు పంపించగా అక్కడ 34వ సారి రక్తదానంచేశారు. తాతీలుకు, రాంబాబుకు వైద్యులు, బాధితకుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలకు కాకినాడ నుంచి



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన స్కేటింగ్ క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): చండీఘఢ్‌లో ఈనెల 27 నుంచి మే 3 వరకు జరగనున్న జాతీయస్థాయి ఓపెన్ రోలర్ స్కేటింగ్ పోటీలకు కాకినాడ క్రీడాకారులు ఎంపికయ్యారు. స్థానిక జన్మభూమి స్కేటింగ్ రింక్‌లో కోచ్ లక్ష్మణ్, చంటి వద్ద శిక్షణ పొందుతున్న 24 మంది ఈ పోటీలకు హాజరుకానున్నారు. ఆదివారం జన్మభూమి పార్కులో జరిగిన కార్యక్రమంలో ఈ పోటీలకు హాజరవుతున్న క్రీడాకారులను సంఘ అధ్యక్షుడు రాజపాల్, కార్యదర్శి దొరస్వామి అభినందించారు.

26న త్యాగరాజ జయంత్యుత్సవం

కాకినాడ కల్చరల్: స్థానిక సూర్యకళామందిర్‌లో సరస్వతీగాన సభ ఆధ్వర్యంలో త్యాగరాజ సేవాసమితి సౌజన్యంతో ఈ నెల 26న బుధవారం సాయంత్రం 4 నుంచి 9 గంటల వరకు త్యాగరాజ జయంతి ఘనంగా నిర్వహించనున్నట్టు నిర్వాహకురాలు పెద్దాడ సూర్యకుమారి తెలిపారు. సంగీత విద్వాంసులు పసుపులేటి వెంకటరమణ, చిట్టిబాబుల నాదస్వర సంగీత కచేరితో వేడుకలు ప్రారంభమవుతాయని తెలిపారు. అనంతరం సంగీత విద్వాంసులు త్యాగరాజ కీర్తనలు ఆలపిస్తారని తెలిపారు. సంగీతాభిమానులు అందరూ హాజరు కావాలని పెద్దాడ కోరారు.

నేడు కార్పొరేషన్‌లో స్పందన

కాకినాడ: ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్ కుమార్ రావిరాల చెప్పారు. ఉదయం 10 గంటల నుంచి ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయం వరకు రాలేని ప్రజలు స్థానికంగా ఉండే సచివాలయాల్లో కూడా విజ్ఞప్తులు అందజేయవచ్చునని కమిషనర్ సూచించారు. న్యాయ వివాదాలు, ఆర్థికపరమైన అంశాలు మినహా మిగిలిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ చెప్పారు. ప్రజలు స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ రావిరాల కోరారు.

అలరించిన స్వరాభిషేకం

కాకినాడ కల్చరల్: స్వరాభిషేకం సినీ సంగీత విభావరి సంగీత ప్రియులను అలరించింది. స్థానిక గాంధీనగర్ పార్కు ప్రాంగణంలోని కళావేదిక వద్ద వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్వరాభిషేకం పేరుతో సినీ సంగీత విభావరి నిర్వహించారు. ఔత్సాహిక కళాకారులను ప్రోత్సహించేందుకు అసోసియేషన్ కృషి చేస్తోందని కార్యదర్శి పి.వీరభద్రరావు అన్నారు. అనంతరం గాయకులు డేవిడ్‌రాజు, శ్రీనివాస్, రాజు, పద్మ తదితరులు ఆలపించిన సినీ గీతాలు అలరించాయి.

మెరుగైన వైద్యం మరింత దగ్గరగా

- రూ.1.22 కోట్లతో యూపీహెచ్‌సీ నిర్మాణం
- 22వేల మందికి ప్రయోజనం
- నేడు మంత్రి విడదల రజినిచే ప్రారంభం



మంత్రి విడదల రజని ప్రారంభించనున్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్

కాకినాడ: ప్రభుత్వ వైద్యసేవలను ప్రజలకు మరింత చేరువ చేసే క్రమంలో వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ప్రజలకు అందుబాటులోకి రానుంది. రూ.1.22 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన ఈ కేంద్రాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని సోమవారం ప్రారంభించనున్నారు. స్థానిక గాంధీనగర్ క్షత్రియ పరిషత్ సమీపంలో ఈ ఆస్పత్రిని నిర్మించారు.

22వేల మందికి ప్రయోజనం

కాకినాడలోని 41, 42, 43, 47 డివిజన్లకు సంబంధించి రామారావుపేట, గాంధీనగర్, స్వామినగర్, ట్రెజరీకాలనీ ప్రాంతాలకు చెందిన సుమారు 22 వేల మంది ప్రజలకు ఈ యూపీహెచ్‌సీ ఉపయోగపడనుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ప్రతి 20 వేల మంది జనాభాకు ఒకొక్క ప్రభుత్వాస్పత్రి అందుబాటులోకి రావాలనే ప్రభుత్వ సంకల్పంలో భాగంగా ఈ కొత్త యూపీ హెచ్‌సీ నిర్మించారు. నగరంలో ఇప్పటికే ఏడు పీహెచ్‌సీలను ప్రారంభించారు. ఇది ఎనిమిదవది.

అందుబాటులో సేవలు

నూతన అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను ఆరు పడకలతో ఏర్పాటు చేశారు. ఒక ఆపరేషన్ థియేటర్‌తో పాటు వ్యాక్సిన్లు వేసేందుకు ల్యాబ్‌ల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఒక మెడికల్ ఆఫీసర్ పర్యవేక్షణలో నిర్వహణ జరుగుతోంది. పూర్తిగా ఉచితంగా సేవలందించే ఈ ఆస్పత్రిలో రోజువారి ఓపీతో పాటు ప్రతి మంగళవారం గైనకాలజిస్ట్ గురువారం పిల్లల వైద్య నిపుణులు, సోమవారం జనరల్ వైద్య నిపుణులు కూడా వచ్చి ఇక్కడ ప్రజలకు సేవలు అందించనున్నారు. అలాగే మెడికల్ ఆఫీసర్‌తో పాటు ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఫార్మాసిస్ట్, ఇతర సిబ్బంది కూడా ఇక్కడ అందుబాటులో ఉంటున్నారు.

నేడు మంత్రి రజిని రాక..

రూ. 1.22 కోట్లతో నిర్మించిన యూపీహెచ్‌సీని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి విడదల రజిని ప్రారంభించనున్నారు. సాయంత్రం 4 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డితో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు కూడా హాజరుకానున్నారు. మంత్రి పర్యటన నేపథ్యంలో నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల పర్యవేక్షణలో అధికారులు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేశారు.

పేదలకు చేరువగా వైద్యం..



ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోంది. ఇందులో భాగంగానే కాకినాడలో సుమారు 8 చోట్ల కొత్త యుపీహెచ్‌సీలను నిర్మించారు. వైద్యం కోసం ప్రజలు ఎవ్వరూ ఇబ్బందులు పడాల్సిన అవసరం లేకుండా సమీపంలోనే వైద్యం అందించేందుకు ప్రతిపాదించిన యూపీహెచ్‌సీల నిర్మాణంలో రాష్ట్రం మొత్తం మీద కాకినాడ అగ్రస్థానంలో ఉంది. ప్రజలకు మంచిసేవలు అందిస్తున్నామన్న సంతృప్తి ఉంది.

– ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కాకినాడ సిటీ ఎమ్మెల్యే

తాపం తీరింది

- భారీ వర్షంతో చల్లబడిన వాతావరణం
- ఎండల నుంచి ప్రజలకు ఉపశమనం
- ఉప్పు రైతులకు స్వల్పంగా నష్టం
- మళ్లీ కురిస్తే పంట దక్కదంటున్న రైతులు
- చినకొత్తూరు పాఠశాలలో విరిగిపడిన చెట్టుకొమ్మ



చినకొత్తూరు పాఠశాలలో విరిగిపడిన చెట్టుకొమ్మ

కరప: వేసవి ప్రారంభంలోనే రెండు వారాల పాటు ప్రచండ భానుడు నిప్పులు చెరగడంతో ప్రజలు వేగిపోయారు. ఆదివారం నాడు కురిసిన భారీ వర్షంతో ప్రజలు ఎంతో ఉపశమనం పొందారు. నల్లటి మబ్బులు ఆవరించి చల్లని గాలులతో మొదలై ఈదురు గాలులు వీచడంతో ప్రజలు సేద తీరారు. కర్తెర్లు, రోహిణి కార్తె రాకుండానే పెరిగిన పగటి ఉష్ణోగ్రతలను భరించలేక అల్లాడిన వృద్ధులు, మహిళలు, పిల్లలు ఈ వర్షంతో తెరిపిన పడ్డారు. ఉదయం సమయంలో ఆకాశంలో మబ్బులు పట్టడంతో పగలే చీకటిగా మారింది. వాహనచోదకులు లైట్లు వేసుకుని వాహనాలను నడిపారు. ఈదురుగాలులతో కురిసిన వర్షానికి చినకొత్తూరులోని మండల ప్రాథమిక పాఠశాల ఆవరణలోని చెట్టుకొమ్మ విరిగిపడింది. ఆదివారం సెలవుకాడంతో ప్రాణాపాయం తప్పిందని, గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. కొన్నిగ్రామాల్లో చిరుజల్లులు పడటంతో ప్రజలు ఎండవేడిమి నుంచి ఉపశమనం పొందారు. పెనుగుదురు, గురజనాపల్లి, ఉప్పలంక గ్రామాల్లో ఉప్పు రాశులు వర్షానికి దెబ్బతిన్నట్టు రైతులు తెలిపారు. పెదకొత్తూరు, వేములవాడ, వలసపాకల, కూరాడ తదితర గ్రామాల్లో తీసిన ఇటుకలు తడిపోయి నష్టం వాటిల్లినట్టు ఇటుక బట్టీల యజమానులు తెలిపారు. రబీ కోతలు ప్రారంభమయ్యాయని కొన్ని గ్రామాల్లో కోసిన చేలు పనమీద తడిపోయాయని, రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. వర్షానికి రెండురోజుల వరకూ మిషన్‌తో కోయించడానికి ఉండదంటున్నారు. వర్షం ఒక్కరోజుతో పోతే ఫరవాలేదని, మళ్లీ కురిస్తే చేతికందివచ్చిన పంట నీటిపాలవుతుందని ఆందోళన చెందుతున్నారు. రబీపంట చేతికందాలంటే వరుణుడు కరుణించాలని రైతులు భగవంతున్ని ప్రార్థిస్తున్నారు.

సర్పంచ్‌లు, కార్యదర్శులకు సన్మానాలు



పెనుగుదురు సర్పంచ్ వెంకటమాధవి



పెనుగుదురు కార్యదర్శి బద్దా చంద్రకళ

కాకినాడ రూరల్: జాతీయ పంచాయతీ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ హాలులో జరగనున్న వేడుకల్లో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ముఖ్య అతిథిగా పాల్గొని వివిధ విభాగాలలో ఉత్తమ పంచాయతీలుగా నిలచిన వాటి సర్పంచ్‌లు, కార్యదర్శులను సన్మానించనున్నారు. కాకినాడ రూరల్ మండలం నుంచి జిల్లా స్థాయిలో మూడు పంచాయతీలు పురస్కారాలకు ఎంపిక కాగా వాటిలో గుడ్ గవర్నెన్స్ విభాగంలో కొవ్వాడ, కొవ్వూరు, ఇన్ఫ్రస్ట్రక్చర్ విభాగంలో కొవ్వూరు, సోషల్లీ సెక్యూర్డ్ విభాగంలో తిమ్మాపురం పంచాయతీలు ఎంపికయ్యాయి. మండల స్థాయిలో వివిధ విభాగాలకు సంబంధించి కొవ్వూరు, తిమ్మాపురం, నేమాం, కొవ్వాడ, రమణయ్యపేట, వలసపాకల, తూరంగి, వాకలపూడి, సూర్యారావుపేట, పెనుమర్తి గ్రామాలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందాయి. ఆయా పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులను ఎమ్మెల్యే కురసాల కన్నబాబు చేతులు మీదుగా సన్మానిస్తామని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు.

పెనుగుదురు పంచాయతీకి జిల్లాస్థాయి అవార్డు

కరప: జిల్లా పరిధిలో పెనుగుదురు గ్రామ పంచాయతీకి రెండు రంగాల్లో జిల్లాస్థాయి అవార్డులు దక్కాయి. ఏటా ఏప్రిల్ నెల 24న జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం నిర్వహిస్తారు. గ్రామ పంచాయతీల్లో 9 రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన వాటిని ఎంపికచేసి జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం రోజున సంబంధిత గ్రామ సర్పంచ్‌లకు, కార్యదర్శులకు కలెక్టరేట్‌లో అవార్డులను అందజేసి, సత్కరిస్తారు. పెనుగుదురు పంచాయతీకి తాగునీరు సమృద్ధిగా సరఫరా చేస్తున్నందుకు, స్వయం సమృద్ధిగా మౌలిక వసతులు కలిగి ఉండటం ఈ రెండు రంగాలలో ప్రతిభ సాధించినందున జిల్లాస్థాయి అవార్డుకు ఎంపికైంది. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ కృతికా శుక్లా ఆధ్వర్యంలో జరిగే జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవంలో ఈ అవార్డులు అందజేస్తారని మండల ఈఓ పీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు తెలిపారు. ఈ వేడుకల్లో రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా, ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొంటారని ఆయన తెలిపారు.

ఘనంగా చందనోత్సవం



చందన లేపన అలంకరణలో రమాసహిత సత్యనారాయణస్వామి

బోట్‌క్లబ్: అక్షయ తృతీయ సందర్భంగా ఆదివారం స్థానిక జర్నలిస్ట్‌కాలనీలో ఉన్న సత్యదేవ మందిరంలో చందనోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి మందిర నిర్వాహకులు పరశురామ్, మధ్వపురోహితులు మధ్వేష్ ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామికి చందనంతో ప్రత్యేకంగా అలంకరించారు. మధ్వ పురోహితులు యాతగిరి మధ్వేష్ మాట్లాడుతూ గంగా పుష్కరాలు జరుగుతున్న ఈ పవిత్ర సమయంలో భక్తుల సహకారంతో చందనోత్సవ లేపనాన్ని సత్యనారాయణస్వామి, రమాదేవి, దాసాంజనేయ, ఉమా సాంబశివలకు అలంకరించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

గాంధీనగర్ గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'



'చదవడం మాకిష్టం'లో పాల్గొన్న విద్యార్థులు

బాలాజీచెరువు: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నగరంలో ఉన్న గ్రంథాలయ శాఖల్లో ఆదివారం నిర్వహిస్తున్న 'చదవడం మాకిష్టం'లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ పాఠశాలలకు చెందిన ఐదో తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులు చందమామ కథలు, అల్లాడిన్, ది ప్లాంట్ కింగ్డమ్, వండర్‌ఫుల్ స్టోరీస్ ఆఫ్‌ది వరల్డ్ తదితర పుస్తకాలు అభ్యసిస్తున్నారు. దాదాపు 100 మంది విద్యార్థులకు పైగా సందర్శించగా గ్రంథాలయాధికారి ములంపాక శ్రీనివాసరావు వారికి కావలసిన పుస్తకాలు అందజేశారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

కరప: ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచి పుస్తకపఠనం అలవరచుకుంటే విజ్ఞానంతో పాటు, అన్ని విషయాలపై అవగాహన పెరుగుతుందని లైబ్రేరియన్ పాట్నీడి వెంకటరంగయ్య సూచించారు. మండలం వేళంగి శాఖా గ్రంథాలయంలో ఆదివారం ×చదవడం మాకిష్టం₹ నిర్వహించారు. గ్రంథాలయంలో అన్ని వర్గాల వారికి సంబంధించిన పురాణ, ఇతిహాసాలతో పాటు, నవలలు, నిరుద్యోగులకు పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు, వార్తా పత్రికలు ఉన్నాయన్నారు. వేళంగి హైస్కూలు విద్యార్థులు, గ్రామస్తులు గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనం చేశారు.

మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు



- అమ్మవారికి కలశ, కుంకుమ పూజలు
- ప్రత్యేక అలంకరణలో దర్శనం



మహాలక్ష్మి అమ్మవారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

పిఠాపురం: పట్టణంలో వేంచేసిన శృంగేరి శంకర మఠం శ్రీమహాలక్ష్మి అమ్మవారి ఆలయ వార్షికోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు ఆదివారం అమ్మవారికి కలశ పూజలు, కుంకుమార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఎమ్మెల్యే పెండెం దొరబాబు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 25వ తేదీ వరకూ ఈ ఉత్సవాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నారు.

రిబేటుకు వారమే గడువు

- సద్వినియోగం చేసుకోవాలి
- కమిషనర్ డాక్టర్ మహేష్ కుమార్



కమిషనర్ మహేష్ కుమార్ రావిరాల

కాకినాడ: 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి, ఖాళీ స్థలాల పన్నును ఐదు శాతం రిబేటుతో చెల్లించేందుకు వారం రోజులే గడువు ఉందని నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్ కుమార్ రావిరాల పేర్కొన్నారు. ఏప్రిల్ 30వ తేదీ లోపు పన్ను చెల్లించే వారికి ఈ రాయితీ కల్పిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మొత్తం పన్నును ఒకేసారి ఏక మొత్తంగా చెల్లించే వారికి మాత్రమే ఐదు శాతం రాయితీ వర్తిస్తుందని కమిషనర్ స్పష్టం చేశారు. ఇప్పటికే చాలా మంది పన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారన్నారు. ప్రజల సౌకర్యార్థం సెలవు రోజుల్లో కూడా పన్నులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. పన్ను చెల్లింపు దారులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ రావిరాల విజ్ఞప్తి చేశారు.

భావనారాయణ స్వామి కల్యాణోత్సవాలకు అంకురార్పణ



ఆలయ ప్రాంగణంలో పందిరి రాట వేస్తున్న భక్తులు

కాకినాడ రూరల్: జిల్లాలో పురాతన ప్రసిద్ధి గాంచిన నారాయణ క్షేత్రం సర్పవరంలోని రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణ స్వామి ఆలయంలో కల్యాణోత్సవాలకు ఆదివారం అంకురార్పణ జరిగింది. మే నెల 1న స్వామివారి దివ్య కల్యాణం సందర్భంగా ఈ నెల 29 నుంచి మే 6 వరకు ఉత్సవాలు జరగనున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం పందిరి రాట వేశారు. ఆలయ కమిటీ చైర్మన్ పుల్ల నారాయణరావు, ఈఓ భీమశంకరరావు, సర్పంచ్ శీలం చిన్నా, ఉప సర్పంచ్ పుల్ల ప్రభాకరరావు, గ్రామ నాయకులు పుల్ల చందు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. సర్పంచ్ శీలం చిన్నా మాట్లాడుతూ కల్యాణోత్సవాలను పురస్కరించుకుని ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టనున్నట్టు తెలిపారు.

జగనన్నే మా భవిష్యత్‌కు ప్రజల మద్దతు



విజయరాయుడుపాలెంలో కరపత్రాలు అందజేస్తున్న గృహసారథులు, కన్వీనర్లు

కరప: జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి ప్రజల నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తోంది. విజయరాయుడుపాలెం, జి.భావారం, పెద్దాపురప్పాడు, సిరిపురం, కొరిపల్లి తదితర గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగనే మళ్లీ సీఎం కావాలని పలుపునిస్తుండగా, అందుకు జగనన్నే మా నమ్మకం అంటూ గృహిణులు, వృద్ధులు మద్దతు ప్రకటించి, తమ ఇంటి తలుపులపైన, గేట్లపైన జగనన్నే మా నమ్మకం స్టిక్కర్లను అతికించుకున్నారు. తమ మొబైల్‌ఫోన్ల నుంచి మిస్డ్‌కాల్స్ ఇచ్చి, కొంతమంది జగనన్న స్టిక్కర్లను తమ మొబైల్ ఫోన్లపై అతికించుకుని, జగనన్న పాలనకు మద్దతు తెలుపుతున్నారు. వివిధ గ్రామాల్లో జరిగిన సర్వేలో మండల సచివాలయ కన్వీనర్ కాదా వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు వెలుగుబంటి సీతారామరాఘవ, రొక్కాల గణేష్, ఏఎంసీ డైరెక్టర్ నున్న వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయ సలహా సంఘం సభ్యుడు బొండా చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



నడకుదురు సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లాప్రధాన కార్యదర్శి ప్రసాద్

కరప: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, కార్మికులను ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ అన్నారు. నడకుదురులో ఆదివారం జరిగిన రామలింగేశ్వర భవననిర్మాణ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్షేమ బోర్డులేక భవన నిర్మాణ కార్మికులు చాలా నష్టపోతున్నారన్నారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు స్పందించి నడకుదురులోని భవననిర్మాణ కార్మికుల సంఘానికి భవనాన్ని నిర్మించి ఇవ్వాలని ఆయన కోరారు. ప్రపంచ కార్మికుల దినోత్సవం మేడే రోజున ఏఐటీయూసీ అనుబంధ సంఘాలతో కలసి జెండా ఆవిష్కరణ, సమావేశాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ప్రసాద్ కోరారు. రామలింగేశ్వర భవన నిర్మాణ కార్మికుల సంఘం నాయకులు ముమ్మిడి అచ్చయ్య, ఎం.అర్జునరావు, వి.శ్రీనివాస్, ఎ.శ్రీమన్నారాయణ, బి.పాపారావు తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి స్ఫూర్తితో మోదీని గద్దె దింపుదాం



అల్లూరి విగ్రహం వద్ద సాగుతున్న సీపీఐ ప్రచార భేరి

కాకినాడ సిటీ: విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు పోరాట స్ఫూర్తితో మోదీని గద్దె దింపుదామని ఆ లక్ష్యంతో ముందుకు వెళదామని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు రావుల వెంకయ్య పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్ర సీపీఐ ప్రచార భేరి డైరీఫారం సెంటర్‌లో నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తాటిపాక మధుతో కలసి పాల్గొని మాట్లాడుతూ నేటి సంఘ్ పరివార్ ఫాసిస్టు శక్తులు ప్రభుత్వ రంగ సంస్థలను ఆదానీ, అంబానీల పరంచేస్తున్నారని విమర్శించారు. జీఎస్టీ పేరుతో రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రాన్ని యాచించే బిక్షగాళ్లగా మార్చారన్నారు. రాజ్యాంగ వ్యవలను తమను వ్యతిరేకించే వారిపైకి ఉసిగొల్పుతున్నారన్నారు. మోడీ దిగాలి అనే మహోద్యమంలా సాగాలన్నారు. కాకినాడ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ, సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, జి.లోవరత్నం, నాయకులు పాల్గొన్నారు.

గోధుమ లోడుతో కార్మికులకు పని



వ్యాగన్ల నుంచి గోధుమలను దిగుమతి చేసుకుంటున్న లారీలు

సామర్లకోట: స్థానిక రైల్వే గూడ్స్ షెడ్ వద్ద 42 గూడ్స్ వ్యాగన్లలో గోధుమలు వచ్చాయి. పెద్దాపురం లలితా రైస్ మిల్లు యాజమాన్యం గోధుమ పిండి పరిశ్రమను ఏర్పాటు చేయడంతో ఆ పరిశ్రమకు మధ్యప్రదేశ్ నుంచి సామర్లకోటకు గోధుమల లోడ్ వచ్చింది. దాంతో ఎగుమతి దిగుమతి కూలీలకు, లారీ ఓనర్స్ అసోసియేషన్‌లో లారీ యజమానులకు పని లభించింది. 42 వ్యాగన్లలో 2,200 మెట్రిక్ టన్నుల గోదుమలు వచ్చినట్లు రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ తెలిపారు. లలితా రైసు మిల్లు యజమానికి సొంతంగా లారీలు ఉండటంతో లారీ అసోసియేషన్ నిబంధనల మేరకు 50 శాతం అసోసియేషన్‌కు ఇవ్వాలనే నిబంధనను పాటిస్తున్నట్లు లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పబ్బినీడి దుర్గాప్రసాద్ తెలిపారు. కాకినాడ రోడ్డులో ఫ్లై ఓవర్ చివరిలోని గూడ్స్ షెడ్‌లోనికి లారీల రాకపోకలు సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. లోడింగ్ సమయంలో పోలీసులు విధులు నిర్వహించేలా చూడాలని స్థానికులు కొరుతున్నారు.

ముగిసిన నూకాలమ్మతల్లి ఉత్సవాలు

అలరించిన కోలాటం, చిన్నారుల నృత్యాలు



ఆలయంలో కోలాటం ప్రదర్శిస్తున్న చిన్నారులు

సామర్లకోట: స్థానిక స్టేషన్ సెంటర్‌లో కొలువైన నూకాలమ్మ ఆలయంలో కొత్త అమావాస్య నుంచి నిర్వహిస్తున్న ఉత్సవాలు ఆదివారంతో ముగిసాయి. ఈ సందర్భంగా అమ్మవారిని భక్తులు భారీ సంఖ్యలో దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో చిన్నారులతో కోలాటం, నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఉత్సవాల ముగింపు రోజున ఆలయ కమిటీ, పంచారామ క్షేత్ర దీపారాధన సేవా సంఘం నూకాలమ్మ పారాయణ కమిటీ సభ్యులు భక్తులకు సేవలందించారు. ఆలయ ప్రధానార్చకుడు దేవళ్ల సాయికుమార్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు పెనుమర్తి వీరవెంకట సత్యనారాయణ, మార్ని శ్రీనివాసు, బొమ్మాలరావు, యార్లగడ్డ శ్రీనివాసు, సత్తి అరుణ భక్తులకు సేవలందించారు.